

# కంపిలి రాయలు



డాక్టర్ నేలటూరి వెంకటరమణయ్య

శ్రీ వేంకటరమణయ్యగారు పేనుమిగిలిన చారిత్రిక పరిశోధకులు; ఆంధ్రుల చరిత్రలో మాటుమణిగిఉన్న ఎన్నో గాథల్ని వీరు ఉద్ధరించి ప్రచారం లోకి తెచ్చారు.

'కంపిలిరాయలు' కథలో ఆ కాలపు రాజకీయాలూ, ప్రజాజీవనం, ఆచారవ్యవహారాలూ చిత్రించబడ్డాయి. కథాకాలపు వాతావరణాన్ని నిర్మించడానికి భాషకూడా తదనుగుణంగా వాడారు.

కథ తరువాయి భాగం వచ్చే సంచికలో ప్రకటితం అవుతుంది.

క్రీ. శ. ౧౪ వ శతాబ్దారంభ దశయందు కంపిలి రాయల కీర్తి జ్వాల ప్రజ్వరిల్లినది. ప్రళయ కాల జలధివలె ముంచుకొనివచ్చు మహమ్మదీయ వాహినికి చెలియలికట్టవలె నడ్డపడి రూపుమాసి పోవ సంసిద్ధమైయుండిన హిందూ ధర్మమును సంస్కృతిని బునరుద్ధరించి కీర్తినందిన మహానుభావుడీ కంపిలిరాయఁడు. జాతిచేనితడుబోయ. ముమ్మడి సింగయనాయకు డితనితండ్రి. బళ్లారి మండల మితని జన్మస్థానము. మంచి శూరుఁడు. దక్కని దళవాయి. దేవగిరి యాదవరాజగు రామదేవ రాయల దండయాత్రలను జయప్రదముగ సాగించి ప్రఖ్యాతిని గడించెను. ఇది యితని జీవితమున ప్రథమదశ.

క్రీ. శ. ౧౩ వ శతాబ్దాంతమున ప్రారంభమైన మహమ్మదీయ దండయాత్రలతో నితని కీర్తిలత ప్రాక నారంభించెను. క్రీ.శ. ౧౨౯౪ వ సంవత్సరమున నల్లాఉద్దీనుఖిల్జీ దక్కనుపై నెత్తివచ్చి దేవగిరి రామదేవరాయని నోడించి తన కరిగాపును గావించెను. రామదేవుఁ డల్లాఉద్దీనునకు దనకుమార్తె నిచ్చి వివాహము గావించి సంధిచేసుకొనెను. ఈ వార్త చెవిసోకఁగనే కంపిలిరాయనికి రోత పుట్టెను; రామదేవునితో దనకుగల స్వామి భృత్య సంబంధమును ద్రెంచివేసి, స్వాతంత్ర్యమును బ్రకటించెను. కంపిలిదేవుడు స్వతంత్ర సంస్థానమును స్థాపించుట ముఖ్యముగ రెండు పరమార్థములను సాధించుటకే. మహమ్మదీయులను నిగ్రహించి హిందూ స్వాతంత్ర్యము నుద్ధరించుట మొదటిది. తురకలయొత్తిడిచే సమసిపోవుటకు సంసిద్ధముగనున్న హిందూ ధర్మమును సంరక్షించుట రెండవది. అదిమొదలు తురకల బారినుండి తప్పించుకొనివచ్చిన హిందూ కాందిశీకులకెల్ల నతని రాజధాని కుమ్మఠము రక్షణస్థానమాయెను. ఇట్లు ఆత్మ సంరక్షణార్థము కుమ్మఠమునకు బారివచ్చినవారిలో హరిహరుడును బుక్కడును ముఖ్యులు. వీరే విజయనగర సామ్రాజ్యమును స్థాపించినవారు. కంపిలిరాయడు వీరి నాదరించి తన కొలువున గొప్ప పదవులయందు నిలిపెను. ఇట్టి కాందిశీకులు కంపిలిరాయని ఆదర సత్కారములను బొందినవారు మఱి యెందరో కలరు.

## పాపోసుల పల్లకీ

మహమ్మదీయులను సరకుగొనక హిందువులకు గన్నాకగుటచే గంపిలిరాయని యెడ భారతీయ మహమ్మదీయులకెల్ల నధిపతియగు ఢిల్లీ పాదుశాహుకు ద్వేషము జనించినది. ఇతనినెట్లయిన, నుదముట్టింపవలయునని పాదుశాహును నతని నాయకులును నిశ్చయించిరి. అల్లా ఉద్దీను చక్రవర్తి, యభినవ కాలయవనుడని ప్రసిద్ధినందిన మల్లిక్ నాయబు

కాఫూరును గొప్పదండుతో నాతనిమీది కంపెను. కాఫూరు కుమ్మరమును ముట్టడించి శృంగభంగము నందిపోయెను. ఈ విజయమువలన కంపిలి రాయని కీర్తి ప్రతిష్ఠలు మరింత నభివృద్ధినందెను. మహమ్మదీయు లతనికి జులకనయిరి. వారి బలపరాక్రమము లతని దృష్టియందు గడ్డిపోచవలె లఘువైపోయెను. ఒక చిన్న విషయము గీని చెల్లముసేయగలదు. ఒకానొకప్పుడు పాదుశాహు పాసోసులు ఢిల్లీ సామ్రాజ్యమందలి దాక్షిణాత్యమండలములనుండి చక్రవర్తి ఖజానాకు జెందవలసిన కరమును వసూలుచేయుటకు మామూలు మర్యాదప్రకారము బయలుదేరినవి. పాసోసుల పల్లకి వచ్చుచున్నదను వార్త చెవిసోకగనే దేశమందంతటను నలజడి పుట్టెడిది. సామంతులేమి, జమీందారులేమి, మండలాధిపతులేమి, కలవరపడి యెదురుసేవకేగి పాసోసులను శిరముపై నిడికొని సగౌరవముగ దమ యధికారస్థానములకుదోడ్కొని వచ్చి పాదుశాహు భండారమునకు జెందవలసిన కప్పమొసగి కానుకలతోగూడ సాగనంపువారు. ఈ మర్యాద కేచటనేనియు నతిక్రమించి లోపము గలిగిన దానికి గారణభూతుడైనవాడు పాదుశాహి యుగ్రకండనకు బాత్రుడగుట సామాన్యము. ఒకనాడు పాసోసుల పల్లకి వచ్చుచున్నదను వార్త కుమ్మరము నడివీధులలో వినవచ్చినది. కంపిలి రాయల చెవిసోకినదో లేదో. సాగలేని యగ్నివలె మండిపడినాడు కుమారరాముడు. ఇతడు కంపిలి రాయల జ్యేష్ఠపుత్రుడు. మఱియు నతని ఖడ్గమంచిక దక్షిణహస్తము. వెంటనే గుఱ్ఱమునెక్కి శరవేగమునబోయి పాసోసులపల్లకి నడ్డగించి భిన్నాభిన్నము గావించెను; పాసోసులను దూరముగ దన్నివేసెను. కుమారరాముని సాహసకృత్యమునకు ఢిల్లీ సామ్రాజ్యము డిల్లవోయినది. ఈ యవమానమున నోర్చుకొనజాలక పాదుశాహి కోపోద్దీపితుడై



చెండునియ్యక రత్నాజి కుమారరామునితో మాటలు పెంచుట

కుమారరాముని నతని తండ్రిని నిర్మూలము గావించ వలయునని నిశ్చయించెను.

## పులిమీద పుట్ర

ఇది యిట్లుండగా పులిమీద పుట్రయన్నట్లు మఱి యొక యపరాధమువలన కంపిలిరాయఁడు పాదుశాహి కోపమును మఱింత దీక్షముగ ప్రజ్వలింప జేసెను. కంపిలిరాజ్యపు టుత్తర గడిప్రదేశమున కృష్ణానది యుత్తర దక్షిణతటమున, సగరను పేరు గల దుర్గమొకటి యుండెడిది. ఢిల్లీ యవన సామ్రాజ్య ప్రాంతసీమయందలి గడి దుర్గములలో నిదియె ముఖ్యమైనది. దీని నప్పుడు ఢిల్లీ పాదుశాహు మేనత్తకుమారుఁడగు బహాఉద్దీన్ గర్షాస్పను నతఁడు పాలించుచుండెను. ఇతఁడు పాదుశాహు నాధిపత్యము నంగీకరింపక స్వాతంత్ర్యమును ప్రకటించెను. గర్షాస్పునికి కంపిలిరాయఁడు మిత్రుఁడు; ఈమైత్రి నాధారపఱచుకొని యతఁడు పాదుశాహి సైన్యములచే బరాజితుడై తన మండలమున నిలువ జాలక సకుటుంబముగ పరారియై కుమ్మరమునకు వచ్చి శరణువేడెను. బహాఉద్దీను మహమ్మదీయుఁడైనను, ప్రబలుడైన ఢిల్లీ పాదశాహునకు గర్భశత్రుడైనను, స్నేహపాశబద్ధుడైన కంపిలిరాయ లతని విడనాడక తనయండ జేర్చుకొనియెను. ఢిల్లీ సైన్యము లిక నతని రాజ్యమును ముంచివేయునను టను సందియమేమి కలదు!

## శూలముల పండుగ

శత్రు ప్రాబల్యమువలన రాజ్యమున కపాయ మిట్లు సన్నిహితమగుచుండగా, గృహఛిద్రము లతని జాల క్షోభ పెట్టినవి. కంపిలిరాయనికి హిరియాలదేవి, రత్నాజియను భార్య లిరువురుగలరు. రత్నాజి వయసున భర్తకంటె చిన్నది. రూపవతి. కుమారరాముని సాహసకృత్యము లామె పసిహృదయము నాకర్షించినవి. ఆమె యెఱుకలేకయే యామె మన సాతనియందు లగ్నమైనది. ఆ కుమారుని రూపమును కనులార గాంచవలయుననియు నతని సాహచర్యముచే కర్ణరంధ్రములనించుకొని తనివితీర గ్రోలవలయుననియు సర్వదా కోరుచుండెడిది. చిర కాలమునకు సమయము తటస్థమైనది. రాయ దూరలేదు. అది శూలములపండుగయైనను, రాబోవు తురకలదండయాత్రయందు దేశసంరక్షణకై కట్టించు చుండిన హొసమలదుర్గమును సత్వరము సంపూర్ణము సేయించుట కతఁ డచటి కేగియుండెను. రాచనగరి లోని యువకులతోగూడ కుమారరాముఁడు నగరి ముందరిమైదానమున పుట్ట చెండాడుచుండెను. అంతః పుర సౌధోపరితలమున నిలిచి రత్నాజి మొదలగు రాజస్త్రీ లందఱును ఆటను జూచుచుండిరి. దైవ వశమున చెండుపోయి సౌధోపరిభాగమున బడి యెను. వెంటనే రత్నాజి యాదేశముపై దాసి దానిదాచినది. ఎవ్వఱువచ్చినను యియ్యక నిరాకరించి రాముఁడే స్వయముగ వచ్చిన నిచ్చెదననెను. పినతల్లి మేడమునకు బోవుట యనుచితము గాదని విచారించియు చెండుకువచ్చి మరల కందుక క్రీడను ముగించవలయునను యిచ్ఛ ప్రేరేపించగా నచటికి బోయెను. మందిర మతఁడు చేరగనే రత్నాజి యెదురువచ్చి సత్కరించి చెండునియ్యక మాటలను బెంచి తన కతని పైగలమోహమును వెల్లడిచేసెను. రాముఁడామె కోరికను నిరాకరించి వ్యాకుల మనస్కుడై నగరు వెలువడివచ్చి మిత్రులను కలిసి కొనియెను. శూలముల పండుగ కుమారరామునికి హృదయశూలమై పరిసమాప్తి నందినది.

## విపరీతవార్త

కంపిలిరాయఁడు హొసమల దుర్గమునుండి మరలి వచ్చెను; పాదుశాహు ఢిల్లీనుంచి బయలువెడలి సైన్యముతో దక్కనుకు వచ్చుచున్నాడనియు గుజరాతు మండలపాలకుఁడు అహమదు అయాసు పాదుశాహు ఉత్తరవు మేరకు కూడిచేసి వచ్చి దండుతోగూడ దేవగిరియందు విడిసి, కుమ్మరముపై దండు గదల్చుకొని వచ్చుటకు ప్రయత్నము సేయుచున్నాడనియు వార్త పట్టణమున ప్రాకినది. వీధుల మొగసాలలను రచ్చపట్టులందును జనులు గుంపులు గుంపులుగగూడి వితర్కింప నారంభించిరి. ఇట్లుండగ మఱి యొక విపరీతవార్త వారి చెవుల సోకెను. కంపిలిరాయలు తన ప్రియపుత్రుడైన కుమారరాముని కంతఃపురద్రోహ మొనర్చు గడగిన యపరాధమునకు మరణదండన విధించెననియు నతని ఖండించుటకు వధ్యస్థానమునకు గొనిపోవుచున్నారనియు వార్త గాలిలో గొట్టుకొనివచ్చినది. గుంపులైయున్న పట్టణ జనము విరియబారి రాజమందిరమువంక ప్రవాహమువలె బరుగిడ నారంభించిరి. వారింకను చాలదూరము పోలేదు; వారి

కెదురు వచ్చుచుండు జనసమూహమునుగాంచి స్తబ్ధులై నిలిచిపోయిరి. ఆ మూక కగ్రస్థానమున డంగురా వాద్యకుడు, వాని వెనుక బారులుతీరి రెండు వరుసల రాజభటులు, వారి నడుమ పాశబద్ధుడును నవనతశిరుడును నగు కుమారరాముడు, అతని ననుసరించి యశ్రుపూరిత నయనుడగు రాముని యన్నకాటణ్ణ; అందఱికి వెనుక మహాప్రధాన దండనాయక బైచప్పయు గానవచ్చిరి. డంగురావాని ఘోషతప్ప మరియేశబ్దమును వినరాలేదు. ఈ యూరేగింపు కోటగవను దాటినది. అంతవరకు పట్టణ ప్రజలు దానితోగూడ నడచిరి. బైచప్పదండనాయకుని యాజ్ఞయైనది. ప్రజలను కోట వెలువడనీయక కోటతలుపులు మూయబడినవి.

## శిలావర్షము

కుమారరాముని దారుణ మరణవార్తవిని కుమ్మరము దుఃఖజలధియందు మునిగియుండినది. హరియాళదేవి యెడసానుభూతి చూపనివారును, రత్నాజిని నిందించనివారును, కంపిలిరాయని చర్యను ఖండించనివారును కుమ్మరమున లేరు. అప్పుడే రాముడస్తంగతుడై వారము గడచినది. కంపిలిరాయడు రత్నాజి నగరినుండి బయటరాక యుండినను, బైచప్ప దండనాయకుడు జతనముతో కోట కావలి కట్టుబొట్లను దృఢపఱచి తురకలు వచ్చిన వారికి తగు రీతిని స్వాగత మొసగుటకు వలయు ప్రయత్నములన్నింటిని చేయుచుండెను. ఇట్లుండ ప్రజల గుండెలలో మొదలుచుండిన భయము మూర్తీభవించి వారి కన్నులముందు ప్రత్యక్షమాయెను. ఒకనాడు అర్ధరాత్రి సమయమున జనులందఱు ఆదమరచి నిద్రించుచుండగా 'రణం' 'రణం' 'రణ' మనుచు రణభేరి మ్రోగినది. దద్దరిల్లిలేచి కోటగోడలప్రక్కలకు కోటలోనివారు పరుగిడిరి. కాని వారినెవ్వరిని చెంతకు రానీయక కోట కావలివారు వెనుకకు మరలించుచుండిరి. కవచకార్ముకఖడ్గధారియై మధ్యవయస్కుడగు సర్దారొకడు అశ్వారూఢుడై పదుగురాశ్వికులతో గూడ కోటగోడల వెంబడి స్వారిచేయుచు, కోటగోడలకు గాపుండు భటులకు వారు చేయవలసిన కార్యమును దెలుపుచు వారా కార్యముల నెట్లు నెఱవేర్చవలసినదియు విశదపఱచుచుండెను. దేవగిరి దర్వాజాకు గాపుండుభటుల కతడేదో యుత్తరు విచ్చుచుండగా పిడుగుబడినట్లు పడినది శత్రుసైన్యములోని మంజనీకుచే విసరబడిన గండశిల, వెంటనే దానికి జవాబిచ్చినవి కోట దద్దడములపై నుండు దంచనములు. మంజనీకులును దంచనములును నిట్టిరువాగుల వారిపై శిలావర్షము గురియింప నారంభించినవి.

## హర హర మహాదేవ

తెల్లవారినది. కంపిలిరాయలు కొలువుదీరి తన నాయకులను సర్దారులను పిలువనంపెను. ఎల్లవారును. యుద్ధమునకు సంసిద్ధులై వచ్చిరి; కొలువు ఎప్పటి తీరున లేదు. సంగరోత్సాహ మెవ్వరి ముఖమునను గానరాలేదు; కుమారరామునితో పాటదియునమసిపోయెనేమో? కంపిలిరాయడును వీరులతో నెప్పటియట్లు పలుకలేదు. అతని ముఖమున గాఢ దుఃఖచిహ్నము లింకను గానవచ్చుచుండినవి. పలుమారతనిదృష్టి ప్రాయికముగ రాముడు సభాస్థానమున నాసీనుడై యుండు తావుపై బ్రసరించినది. అంతర్గతమైన మానసిక వ్యధ ముఖముపై బ్రతిబింబించుచుండెను. తుదకెట్లో చిత్తమును దృఢపఱచుకొని, కొలువువారిని గలయజూచి నాయకులారా శూరులారా, పాదుశాహు మనల నిర్మూలింప నిశ్చయించి దండెత్తినాడు. కదనభూమి కంపిలి వీరులకు గల్యాణమందిరము కదా. తురకవారికి మన కత్తిపోటు రుచి చూపించవలయును. ఇప్పుడు మీ హృదయసీమల రాముడు తాండవ మాడుచున్నాడని యెఱుగుదును. చింతించిన నేమిలాభము? రాముడులేని కొదవ మీ చిత్తముల జేరనీయక శత్రుసంహారమునకు గడగుడు-లెండు.-'హరహర మహాదేవ' యని యుద్ఘోషించెను. 'హరహర మహాదేవ' యని ప్రత్యుద్ఘోషము గావించి వీరులందఱును యుద్ధమునకు నడచిరి.